క్లుప్తంగా

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్



సంఘటన స్థలంలో నిలిచిన బస్సు, టిప్పర్

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులో అయ్యప్పస్వామి గుడి సమీపంలో పాలకొండ నుంచి రాజాం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును టిప్పర్ బలంగా ఢీకొట్టింది. సోమవారం జరిగిన ఈ ఘటనలో అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. అయితే ఆయా వాహనాలు రోడ్డుపైనే ఉండిపోవడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనకు సంబంధించి, తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలిపారు.

అంబేడ్కర్ జంక్షన్ అభివృద్ధికి సర్వే



సర్వే చేస్తున్న దృశ్యం

రాజాం: స్థానిక అంబేడ్కర్ జంక్షన్ అభివృద్ధి నిమిత్తం విశాఖపట్నం సర్వే బృందం సోమవారం సర్వే నిర్వహించింది. ఈ బృందంలోని సర్వేయర్లు డీజీబీఎస్ మెషీన్ ద్వారా కొలతలు నిర్ధారించారు. జంక్షన్‌కు నాలుగు వైపులా రోడ్డును విస్తరించడంతో పాటు ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లోకి వచ్చి పోయే బస్సులు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా కూడలిని విస్తరిస్తున్నట్లు కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. ప్రస్తుతం సర్వే పనులు మున్సిపల్ టీపీవో తేజేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతున్నాయని, సర్వే బృందం ఇచ్చిన కొలతల ఆధారంగా నిధులకు ప్రతిపాదనలు పెట్టనున్నామన్నారు.

శివతత్వం అనుసరించాలి

బొబ్బిలిరూరల్: ప్రతిఒక్కరూ శివతత్వం అనుసరించి, జ్ఞానంతో ముక్తిమార్గం సాధించుకోవాలని ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు అన్నారు. మండలంలోని పక్కి గ్రామంలో శివబాబా 89వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె.. బ్రహ్మకుమారీలతో కలిసి ఆధ్యాత్మిక పతాకాన్ని ఆవిష్కరించి, కాసేపు ప్రసంగించారు. ప్రతిఒక్కరూ రోజులో ఎంతో కొంత సమయాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయించాలని తెలిపారు.

శివలింగాలను తాకిన సూర్యకిరణాలు



శివలింగాలపై సూర్యకిరణాలు పడిన దృశ్యం

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలో ఉన్న మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలోని శివలింగాలను సూర్యకిరణాలు తాకాయని ఆలయ అర్చకులు అంది సాంబశివరావు సోమవారం తెలిపారు. ఇక్కడి లింగాలు స్వయంభుగా శివపార్వతుల లింగాలుగా వెలిశాయని, శివలింగాలను భానుడు తాకిన దృశ్యాన్ని భక్తులు చూసి పరవశించిపోయారన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



మాట్లాడుతున్న పక్కి వాసు

వంగర: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి మద్దతు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పక్కి వాసు కోరారు. మండలంలోని మద్దువలస, కొప్పర, యూకేగుమ్మడ పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యతా ఓటు విజయగౌరికి వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ప్రసాద్, పెంకి గౌరీశంకరావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్కులను ఆహ్లాదకరంగా ఉంచాలి

బొబ్బిలి: పార్కులను ఆహ్లాదకరంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. స్థానిక పట్టణంలోని రాణిమల్లమ్మదేవి పార్కును ఆమె సోమవారం సందర్శించారు. పార్కు పరిసరాల్లో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తీసివేయాలని, చెరువులోని వ్యర్థాలు తొలగించాలని తెలిపారు.



రామభద్రపురంలో సాగులో ఉన్న క్యాబేజీ పంట

రబీపైనే ఆశలు!

- ఖరీఫ్‌లో తుపానుల ప్రభావంతో పాడైన పంటలు
- వర్షాలతో నేలబావుల్లో పెరిగిన భూగర్భజలాలు
- రబీలో జోరుగా ఆరుతడి పంటల సాగు
- పంటలు ఏపుగా పెరగడంతో అన్నదాత హర్షం
- జిల్లాలో 18 వేల హెక్టార్లలో మొక్కజొన్న, 400 హెక్టార్లలో కూరగాయల సాగు

రామభద్రపురం: తుపాను వర్షాల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేసిన పంటలు పాడయ్యాయి. దీంతో పీకల్లోతు అప్పులో అన్నదాత కూరుకుని పోయే పరిస్థితి. ఈ నేపథ్యంలో రబీ సీజన్‌లో వేసుకునే ఆరుతడి పంటలపై రైతులు గంపెడాశలు పెట్టుకుంటున్నారు. వర్షపు నీటితో నిండుకున్న నేల బావుల ద్వారా సాగుకు పుష్కలంగా నీరు లభిస్తుండడంతో పాటు వేసిన పంటలు కూడా ఇప్పుడు ఏపుగా పెరుగుతుండడంతో ఈసారి పంట బాగా చేతికి వస్తుందని, అప్పులన్నీ తీరిపోతాయని, ఎం



రామభద్రపురంలో బంతి తోటకు నీరు కడుతున్న రైతు



నాయుడువలసలో సాగు చేస్తున్న మొక్కజొన్న

తో కొంత ఆదాయం కూడా వస్తుందని పలువురు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 18 వేల హెక్టార్లలో మొక్కజొన్న, బెండ, టమాటా, చిక్కుడు, కాలీఫ్లవర్, క్యాబేజి పంటలతో పాటు మరో 400 హెక్టార్లలో తోటకూర, జనపకూర, చుక్కకూర, పాలకూర తదితర ఆకుకూరలను సాగు చేస్తున్నారు. మరో 2 వేల హెక్టార్లలో మొక్కజొన్న, మరో 50 హెక్టార్ల విస్తీర్ణంలో కూరగాయల సాగు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కొన్ని పంటలు ఏపుగా పెరగడం, మరికొన్ని పంటలు రైతు చేతికి అందడంతో రైతులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు సర్కారు నిర్లక్ష్యం..

గత ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పీఎం కిసాన్‌తో కలిపి ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద రైతు కుటుంబానికి రూ.13,500ను పెట్టుబడి సాయంగా అందించింది. ఒకవేళ పంట కాలంలో తుపాను వర్షాల కారణంగా పంట నష్టపోయినా బాధిత రైతులకు నష్టపరిహారం కూడా అందజేసింది. ప్రస్తుతం అధికారంలోని చంద్రబాబు సర్కారు మాత్రం రైతాంగాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం పేరిట ఏటా రూ.20 వేలు సాగుకు సాయం చేస్తామని చెప్పి, ఇంతవరకు అందివ్వలేదు. దీంతో పాటు పాడైన పంటలు, వర్షానికి దెబ్బతిన్న పంటలకు కూడా అంతగా నష్టపరిహారం కూడా అందివ్వని దుస్థితి నెలకొంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ తీరుపై రైతులంతా దుమ్మెత్తిపోస్తున్నారు. నమ్మించి నట్టేట ముంచడమంటే ఇదేనని మండిపడుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి..



ఖరీఫ్ సీజన్‌లో వరుస తుపానుల కారణంగా కూరగాయ పంటలకు తీవ్ర నష్టం జరిగింది. ప్రభుత్వం ఇంతవరకు రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రబీ సీజన్‌లోనూ అప్పులు చేసి మరీ పంటలు పండిస్తున్నాం. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకున్న మాదిరే ఇప్పటి ప్రభుత్వం కూడా ఆదుకోవాలి. పెట్టుబడి సాయం అందివ్వాలి.

– తూముల సింహాచలం, కూరగాయ రైతు, రామభద్రపురం

సస్యరక్షణే శ్రీరామరక్ష..



సాగులో సస్యరక్షణ చర్యలే శ్రీరామరక్ష.. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. రబీ సీజన్‌లో ఎండలతో వేడి వాతావరణం ఉంటుంది. దీంతో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించాలి. కూరగాయల సాగు చేసే రైతులంతా పంటలకు పట్టే తెగుళ్లు, చీడపీడల నివారణపై అప్రమత్తంగా ఉండాలి. కూరగాయ రైతులు ఓ బ్యాటరీ స్ప్రేయర్ లేదా పెట్రోల్ స్ప్రేయర్ కొనుగోలు చేస్తే ఆ బిల్లుతో పాటు విత్తన బిల్లు పరిధిలోని ఆర్‌ఎస్‌కేలలో దరఖాస్తు అందజేయాలి. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది.

– ఏవీఎస్‌వీ జమదగ్ని, జిల్లా ఉద్యానశాఖాధికారి, విజయనగరం

పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం

రాజాం: వైఎస్సార్ సీపీ అభివృద్ధి, బలోపేతం కోసం కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం ఇవ్వడం జరుగుతుందని ఆ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఇటీవల పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన రేగిడి మండల వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడును ఆయన సోమవారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడిన మాట తప్పని నేత అని ప్రశంసించారు. పార్టీ జెండా మోసిన ప్రతి ఒక్కరినీ గుర్తుంచుకుని మరీ పార్టీ పదవులు ఇచ్చి వారిని గుర్తిస్తుండడం గర్వంగా ఉందన్నారు. రేపు రాష్ట్రంలో అధికారం చేపట్టబోయే పార్టీ మన వైఎస్సార్ సీపీయేనని, ప్రస్తుతం అధికార కూటమి అరాచక పాలనను అందరూ గమనిస్తున్నారన్నారు. తనకు ఇచ్చిన పార్టీ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందని అచ్చెన్నాయుడు అన్నారు. కార్యక్రమంలో పార్టీ రేగిడి మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, మేధావి వర్గం వింగ్ అధ్యక్షుడు కెల్ల మన్మధరావు, సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ తలే రాజేష్‌ను కలిసిన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అచ్చెన్నాయుడు

కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అవుతుందని ఏపీవో ఎస్.హరనాథ్ తెలిపారు. మండలంలోని మజ్జిరాముడుపేట పెద్ద మొక్కవాని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. రెండుపూటలా పనిచేయాలని, ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్న వేళల్లో పనులు చేసుకుంటే వేసవి ఎండకు దొరకరన్నారు. మండుటెండలో పనిచేస్తే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

సంతకవిటి: మండలంలోని కేఎస్ పేట పెద్ద చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ పరిశీలించారు. వేతనదారులంతా పనిముట్లతో పనికి రావాలని, అప్పుడే ఇచ్చిన కొలతల ప్రకారం చేయాల్సిన పని చేయడం సులువవుతుందన్నారు. పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని, బోగస్ మస్తర్లు వేయవద్దన్నారు.



రేగిడి: వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథ్

పాఠశాలల అభివృద్ధిలో ఎస్‌ఎంసీలే కీలకం

రాజాం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ కమిటీ చైర్మన్(ఎస్‌ఎంసీ)లు, సభ్యుల పాత్రే కీలకంగా ఉండాలని ఎంఈవో యాగాటి దుర్గారావు సూచించారు. మండలంలోని కొఠారిపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతంపై ఆరాతీయడంతో పాటు ఎస్‌ఎంసీలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించాలని, పాఠశాలలో చిన్న చిన్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించేలా ఉండాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వండి పెడుతున్న ఆహార పదార్థాలను రుచిచూసి తనిఖీ చేశారు. రుచి, శుచి కలిగిన భోజనాలు విద్యార్థులకు పెట్టాలని, మెనూ ప్రకారం వంటకాలు చేయాలని తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. రాజాంలోని ప్రభుత్వ బాలురు, బాలికల జూనియర్ కళాశాలలతో పాటు గాయత్రి జూనియర్ కళాశాల, జీసీఎస్ఆర్, చైతన్య, నారాయణ, వేద గాయత్రి విద్యాసంస్థల్లో మార్చి 1వ తేదీ నుంచి పరీక్షలు జరగనున్నాయన్నారు. పరీక్షలప్పుడు ఆయా కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఉండడం గానీ ఐదుగురు కన్నా ఎక్కువ మంది గుమికూడి ఉండడం కానీ చేయరాదన్నారు. పరీక్ష పూర్తయినంత వరకు జిరాక్స్ సెంటర్లు తెరిచి ఉంచకూడదన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి



బొబ్బిలి: శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు



రేగిడి: టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌పీలు

జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు అన్ని మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రీ స్కూల్ నిర్వహణతో పాటు చిన్నారులకు విద్యాబోధన చేయడంపై తగిన శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందివ్వడం, గర్భిణులు, బాలింతలకు అందివ్వాల్సిన పౌష్టికాహారం సక్రమంగా పంపిణీపై శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో నేర్చుకుంటున్న ప్రతీది పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేలా శిక్షణ కొనసాగుతుండడం గమనార్హం.

– బొబ్బిలి, రాజాం, వంగర, రేగిడి, తెర్లాం

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

రామభద్రపురం: మండలంలోని బూసాయవలస గ్రామానికి చెందిన వ్యక్తికి ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రగాయాలైన ఘటన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మడక కృష్ణ అనే వ్యక్తి తన ఇంటికి వెళ్లిపోవడానికి జాతీయ రహదారి దాటుతుండగా విజయనగరం వైపు నుంచి అతివేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఆయనను బలంగా ఢీకొట్టింది. దాంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి క్షతగాత్రుడిని తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు.

ఇంటింటి కుళాయిల నిర్మాణం

తెర్లాం: మండలంలోని కొల్లివలస గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ఇంటింటి కుళాయిల నిర్మాణం చేపడుతున్నామని అప్పలంపేట సర్పంచ్ గురవాన పార్వతీసూర్యనారాయణ సోమవారం తెలిపారు. గ్రామంలోని కొన్ని వీధుల్లో ఇంటింటి కుళాయిలు లేవని, వేసవిలో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని కుళాయిల నిర్మాణం చేపడుతున్నామన్నారు.

సకాలంలో సర్వేలు పూర్తి చేయాలి

రాజాం సిటీ: మండలంలోని అన్ని గ్రామాల్లో చేపడుతున్న సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలోని ఆయన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమై, సర్వేలపై సమీక్ష నిర్వహించారు. ప్రతిరోజూ చెత్తసేకరణ చేయాలని, పీఆర్ వన్ యాక్టివిటీ, ఇంటి పన్ను వసూళ్లు, స్వర్ణ పంచాయతీ డేటా ఎంట్రీ తదితర అంశాలపై సమీక్షించారు. గ్రామాల్లో చేపడుతున్న సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

తెర్లాం: మండలంలోని కొల్లివలస గ్రామంలో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఎంపీడీవో రాంబాబు, ఈవోపీఆర్‌డీ నీలిమ ఆదేశాల మేరకు సర్పంచ్ గురవాన పార్వతీసూర్యనారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనుల్లో గ్రామంలోని అన్ని వీధుల్లోని వీధి కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నారు. పారిశుధ్య పనులు చేయడం ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రత్నం

రామభద్రపురం: ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని ఎంపీడీవో రత్నం ఆదేశించారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంతో పాటు మూడు సచివాలయాలను ఆమె సోమవారం సందర్శించారు. రికార్డులు చూసి, ఇంటి పన్ను వసూళ్లు అవుతున్నాయా లేదా అని ఈవో శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.

విద్యార్థులు రోడ్డు ఎలా దాటాలి?



రామభద్రపురం మండలం, జీలికవలస గ్రామస్తులు సోమవారం రాస్తారోకో చేపట్టారు. రహదారి నిర్మాణ సంస్థ హెచ్‌జీ ఇన్‌ఫ్రా కంపెనీ ఎదుట బైఠాయించి, 6 లైన్ రోడ్డు నిర్మిస్తే గ్రామానికి చెందిన విద్యార్థులు రోడ్డు దాటి అవతలి జమ్మువలస పాఠశాలకు ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. గ్రామం నుంచి జమ్మువలస వెళ్లే రహదారి వద్ద అండర్ పాస్‌వే ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గిరిజన గ్రామాలకు కొత్తగా రోడ్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు అదారి జయరావు, కొత్తల రాజయ్య, దేటుకరి ప్రసాద్, కదుమూరి బానయ్య తదితరులు పాల్గొన్నారు.

– రామభద్రపురం

వైద్యం.. దయనీయం..



పేరుకే 50 పడకల ఆస్పత్రి.. అభివృద్ధి మాత్రం శూన్యం. ఇదీ బాడంగి సీహెచ్‌సీ పరిస్థితి. అక్కడ వైద్యం.. దయనీయంగా మారింది. నిత్యం రోగులతో కిటకిటలాడే ఈ ఆస్పత్రిని గత కొన్నాళ్లుగా వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీనికితోడు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో ఉండాల్సిన రోగులకు సరిపడ మంచాలు లేకపోవడంతో వారంతా అవస్థలు పడుతున్నారు. ఓ వైపు ఆస్పత్రి వరండాలోనే బెడ్లు వేసి రోగులకు చికిత్స అందిస్తున్న దృశ్యాలు.. మరోవైపు ఒకే బెడ్డు మీద ఇద్దరు, ముగ్గురేసి రోగులకు వైద్యసేవలు అందిస్తున్న దృశ్యాలు కోకొల్లలు. ఇదంతా అధికార యంత్రాంగానికి తెలిసినా పట్టించుకోకపోవడం పట్ల రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ గోడు పట్టదా అని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

– బాడంగి

ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు తీసుకుంటే మంచి ఆరోగ్యం పొందవచ్చని ఎంపీడీవో రేగి రాంబాబు అన్నారు. తెర్లాం ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయోత్పత్తుల విక్రయ స్టాల్ సోమవారం ప్రారంభించి, ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయలు విక్రయించారు. ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగం ఎక్కువ అవ్వడం వల్ల పంటలు విషపూరితమైపోతున్నాయని, అలాంటి వాటిని తీసుకోవడం వల్ల రోగాల బారినపడాల్సి వస్తోందని వివరించారు. ప్రతిఒక్కరూ ప్రకృతి సాగు వైపు మరలాలని, ప్రకృతి వ్యవసాయ పంటలే తినాలని కోరారు.

– తెర్లాం

కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు

రాజాం సిటీ: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయకుండా ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం హేయమైనదని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు మండిపడ్డారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్మికులతో సోమవారం సమావేశమైన ఆయన.. మంత్రి వర్గ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆప్కాస్ రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ విధివిధానాలు కార్మికుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

తాగునీటి సరఫరాపై డీఎల్‌పీవో ఆరా

రాజాం సిటీ: మండలంలోని గెడ్డవలస గ్రామంలో తాగునీటి సరఫరాపై డీఎల్‌పీవో మోహనరావు సోమవారం ఆరాతీశారు. ఇటీవల గ్రామానికి చెందిన ముదిలి వెంకటరమణ గ్రామంలో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామంలో సోమవారం పర్యటించిన ఆయన గ్రామస్తుల వద్ద వివరాలు సేకరించారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగన్మోహనరావును ప్రశ్నించగా, గెడ్డవలసతో పాటు మరో 12 గ్రామాలకు సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ కింద నీటి సరఫరా జరుగుతోందన్నారు. రేగిడి మండలం మజ్జిరాముడుపేట వద్ద పైపులైన్ పాడైందని, దాని మరమ్మతులు జరిపి నీటి సరఫరాను పునరుద్ధరించనున్నామన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీరు పూర్తిస్థాయిలో అందించాలని సూచించారు. అనంతరం ఎంజేవలసలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. కేంద్రం వినియోగంలోకి వచ్చేలా చూడాలని, ఇళ్ల నుంచి సేకరించిన చెత్త ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గెడ్డవలసలో నీటి సరఫరాపై ఆరాతీస్తున్న డీఎల్‌పీవో మోహనరావు

ముమ్మరంగా వాహన తనిఖీలు

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులో జీఎంఆర్ ఐటీ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు సోమవారం ముమ్మరంగా చేపట్టారు. సంతకవిటి ఎస్ఐ ఆర్.గోపాలరావు సిబ్బందితో కలిసి వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎటువంటి పత్రాలు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించి, వసూలు చేశారు. గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశామని, ప్రతిరోజూ వాహన తనిఖీలు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



కారు డిక్కీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు